
అక్రమం.. భూస్థాపితం

తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధిలో ఇటీవల వెలసిన పలు అక్రమ నిర్మాణాలను సికింద్రాబాద్ జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. తార్నాక నుంచి లాలాపేటకు వెళ్లే ప్రధాన రహదారిలో తాజా కిచెన్ వారు ఆక్రమించిన ఫుట్‌పాత్, తార్నాక స్ట్రీట్ నెంబర్– 2లో ఓ ఇంటిపై వెలిసిన పెంట్ హౌజ్, లాలాపేట ఓ హోటల్ ముందున్న అక్రమ నిర్మాణాన్ని భూస్థాపితం చేశారు. –లాలాపేట





నాసిరకం.. అధికారుల మౌనం

ప్రజాపయోజనాల కోసం చేపడుతున్న అభివృద్ధి పనులపై పర్యవేక్షణ లేకపోవడంతో నాణ్యత కొరవడుతోంది. సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో లక్షలాది రూపాయల వ్యయంతో వేస్తున్న రోడ్లు మున్నాళ్ల ముచ్చటగానే మారుతున్నాయి. బన్సీలాల్‌పేట్ డివిజన్ బోయిగూడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు వెంకట్రామ్ బిల్డింగ్ సమీపంలో బేగంపేట్ సర్కిల్ పరిధిలోని బన్సీలాల్‌పేట్, మోండా మార్కెట్, రాణిగంజ్, బోయిగూడ, భోలక్‌పూర్, ఓల్డ్‌బోయిగూడ, గాస్ మండి తదితర ప్రాంతాల్లో వేసిన రోడ్లపై కంకర తేలుతున్నా అధికారుల మౌనానికి అర్థం ఏంటో తెలుపాలని స్థానికులు కోరుతున్నారు. –బన్సీలాల్‌పేట్

గుంతలమయం.. పట్టించుకోరేం?



డివిజన్‌లోని ఏకశిల మెడికల్ హాల్ ప్రాంతంలో రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. గతంలో జరిగిన పైప్‌లైన్ పనుల అనంతరం రోడ్డును సరిగా వేయకపోవడంతో అధ్వానంగా మారి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. అంతేకాక డ్రైనేజీలు ఓవర్ ఫ్లో అవుతున్న సమయాల్లో ఆ గుంతల్లో మురుగునీరు చేరడంతో ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయని ఉన్నతాధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. –బౌద్ధనగర్

కాంగ్రెస్ విజయానికి పాటుపడాలి



మాట్లాడుతున్న భట్టివిక్రమార్క

సనత్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల విజయ స్ఫూర్తితో పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. మంగళవారం జరిగిన సనత్‌నగర్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ మాట మీద నిలబడే పార్టీ, మాట ఇస్తే ఎంతటి కష్టమైనా అమలు చేసి తీరుతామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తామని, ఈ విషయంలో ఎలాంటి ఆందోళన అవసరం లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీని గెలిపించడంతో రాష్ట్రంలో మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షులు అనిల్‌కుమార్‌యాదవ్, కుసుమకుమార్, డాక్టర్ రవీందర్‌గౌడ్, కోట నీలిమ పాల్గొన్నారు.

ఖేలో ఇండియాకు ప్రాధాన్యం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మల్కా కొమురయ్య

కంటోన్మెంట్: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఖేలో ఇండియా' కార్యక్రమం ద్వారా దేశ వ్యాప్తంగా క్రీడలకు ప్రాధాన్యం పెరిగిందని బీజేపీ నాయకులు మల్కా కొమురయ్య అన్నారు. ఈ నెల 31, ఫిబ్రవరి 1న మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని కుత్బుల్లాపూర్‌లో నిర్వహించనున్న క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్‌ను మహేంద్రాహిల్స్‌లోని తన కార్యాలయం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొమురయ్య మాట్లాడుతూ.. ఖేలో ఇండియా కార్యక్రమం ద్వారా 307 కొత్త స్పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులను మంజూరు చేశారని ఈ స్ఫూర్తితో యువత పెద్ద సంఖ్యల్లో క్రీడల్లో రాణిస్తున్నారని అన్నారు. తమవంతుగా 'ప్లే ఫర్ మల్కాజ్‌గిరి' పేరిట టోర్నమెంట్‌లు నిర్వహిస్తున్నామన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేసున్న విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పద్మావతి

సనత్‌నగర్: రక్తదానం ప్రాణదానంతో సమానమని బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మావతి అన్నారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్, ఐపీఎం (ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసన్) నారాయణగూడ సంయుక్తాధ్వర్యంలో మంగళవారం కళాశాల ఆవరణలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. రక్తదానం చేయడం వల్ల సమస్యలు వస్తాయనే మాట అపోహ మాత్రమేనన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో యువత స్వచ్ఛందంగా పాల్గొని స్ఫూర్తిగా నిలుస్తుండడం శుభపరిణామం అన్నారు. ఈ సందర్భంగా దాదాపు 100 మంది ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు 23 యూనిట్ల రక్తాన్ని అందించారు. కార్యక్రమంలో డాక్టర్ శరత్, ప్రణీత, పద్మశ్రీరజని, నర్సింహులు, మధుకర్‌రావు, సరోజిని, సరిత, ప్రసన్న పాల్గొన్నారు.

డీజీపీకి ఓయూ జేఏసీ నేత ఫిర్యాదు

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ పై ఓయూ విద్యార్థి జేఏసీ చైర్మన్ సురేష్‌యాదవ్ మంగళవారం రాష్ట్ర డీజీపీ రవిగుప్తాకు ఫిర్యాదు చేశారు. మామిడి హరికృష్ణ తనను హత్య చేయాలని కొందరికి సుపారి ఇచ్చినట్లు ఆరోపించారు. గత కొంత కాలంగా తనను చంపుతానని సుపారి గ్యాంగ్ ఫోన్లు చేసి బెదిరిస్తున్నారని సెల్ నంబర్లను డీజీపీకి అందించారు. మామిడి హరికృష్ణతో తనకు ప్రాణహాని ఉందని వెంటనే ఆయనను అరెస్ట్ చేసి విచారించాలని ఫిర్యాదులో పేర్కొన్నట్లు సురేష్‌యాదవ్ తెలిపారు.

ప్రభుత్వ అవకాశాలను ప్రజల వద్దకు చేర్చాలి

సనత్‌నగర్: భారత రాజ్యాంగం కల్పించిన హక్కుల మేరకు ప్రభుత్వాలు కల్పించే అవకాశాలను సరైన పద్ధతిలో ప్రజలకు చేరువ చేసినప్పుడే సామాజిక న్యాయం జరుగుతుందని ప్రముఖ ఆర్థికవేత్త ప్రొఫెసర్ డీ నర్సింహారెడ్డి అన్నారు. బేగంపేటలోని సామాజిక, ఆర్థిక అంశాల అధ్యయన కేంద్రం (సెస్)లో మంగళవారం ఆ సంస్థ మాజీ డైరెక్టర్ దివంగత ప్రొఫెసర్ వాహిదుద్దీన్ ఖాన్ స్మారక ఉపన్యాసం జరిగింది. దీనికి సెస్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకట్రామయ్య అధ్యక్షత వహించగా ప్రస్తుత డైరెక్టర్ ప్రొఫెసర్ రేవతి అతిథులను సభకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. దేశంలోని ప్రజలందరికీ ప్రాథమిక విద్య తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని, అందుకోసమే విద్య హక్కు చట్టం అమలులో ఉందన్నారు. ఈ సమావేశంలో సెస్ చైర్మన్ ప్రొఫెసర్ నాచినే, ప్రొఫెసర్ హన్మంతరావు, ప్రొఫెసర్ మహేందర్ రెడ్డి, డాక్టర్ జీఆర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థి ఔదార్యం

చదువుకున్న కళాశాలకు రూ. 10 లక్షల ఫర్నీచర్ వితరణ



పద్మారావునగర్: చదువుకున్న కళాశాల పట్ల తన ఔదార్యాన్ని చాటుకున్నాడు ఓ పూర్వ విద్యార్థి. విజయవాడ కెనరా బ్యాంక్ జనరల్ మేనేజర్‌గా పని చేస్తున్న పి.రవివర్మ సికింద్రాబాద్ పద్మారావునగర్‌లోని సర్దార్ పటేల్ కాలేజీకి రూ. 10 లక్షల ఫర్నీచర్ అందజేశారు. రవివర్మ ఎస్పీ కాలేజీలో 1981–84 డిగ్రీ పూర్తి చేశారు. చదువు చెప్పిన కళాశాలకు ఏదో ఒకటి చేయాలని భావించి సీఎస్‌ఆర్ కింద రూ.10 లక్షల ఫర్నీచర్ అందజేశారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రవివర్మ మాట్లాడుతూ.. ఎస్పీ కాలేజీలో నాటి గురువులు నైతిక విలువలతో కూడిన విద్యా విధానాన్ని బోధించడం ద్వారా తాను ఈ స్థాయిలో ఉన్నానన్నారు. ఓ స్థాయికి వచ్చిన తర్వాత తమవంతు బాధ్యతగా కళాశాలకు ఏదో ఒకటి సహాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ హేమలత, ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి, కోశాధికారి సూరజ్ సింగ్, పరిపాలన అధికారి రాహుల్, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు ఎం. రాజశేఖర్, కార్యదర్శి హరినారాయణరావు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ ఆసక్తి కనబర్చాలి

సనత్‌నగర్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల పట్ల కూడా ఆసక్తి కనబర్చాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్‌లోని స్పోర్ట్స్ గ్రౌండ్‌లో రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ఆర్‌ఎస్‌ఎంఏ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వార్షిక స్పోర్ట్స్ మీట్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులకు బడిలో ఉపాధ్యాయులే తల్లిదండ్రులు అని, మంచి విద్యాబుద్ధులు చెప్పి విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్ది బంగారు భవిష్యత్‌ను అందించే గురుతర బాధ్యత ఉపాధ్యాయులు నిర్వర్తిస్తున్నారన్నారు. సమాజంలో తల్లిదండ్రుల తర్వాతి స్థానం ఉపాధ్యాయులదేనన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్లకు ఎంతదూరంగా ఉంటే అంత మంచిగా ఉంటుందన్నారు. క్రీడల్లో పాల్గొనడంతో ఒత్తిడి నుంచి ఉపశమనం కలుగుతుందన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు ఏయే రంగాల్లో ఆసక్తి ఉందో గుర్తించి ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీ, నాయకులు కొలను బాల్‌రెడ్డి, ఆర్‌ఎస్‌ఎంఏ అధ్యక్షులు అగస్టీన్, కార్యదర్శి సుధాకర్, కుతుబుద్దీన్, వీవీ రావు, ఎంఎస్ ప్రసాద్, ప్రశాంత్, హిమబిందు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్



మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న విద్యార్థులు

సెలెక్టెడ్ నర్సింగ్ ఆఫీసర్ల సంబరాలు



నర్సింగ్ సూపరింటెండెంట్ మంగమ్మకు స్వీట్లు తినిపిస్తున్న సెలెక్టెడ్ నర్సింగ్ ఆఫీసర్లు

గాంధీఆస్పత్రి: గాంధీఆస్పత్రిలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తు మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణులై, నర్సింగ్ ఆఫీసర్లుగా ఎంపికైన పలువురు నర్సింగ్ సిబ్బంది మంగళవారం సంబరాలు చేసుకున్నారు. గాంధీ ఆస్పత్రిలో 260 మంది నర్సింగ్ సిబ్బంది అవుట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తుండగా, 90 మందికి పైగా నర్సింగ్ ఆఫీసర్లుగా ఎంపికయ్యారు. తమకు అన్ని విధాల సహాయ సహకారాలు అందించిన ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు, నర్సింగ్ సూపరింటెండెంట్ మంగమ్మకు పుష్పగుచ్ఛం అందించి మిఠాయిలు తినిపించారు. రాష్ట్రవ్యాప్తంగా నర్సింగ్ ఆఫీసర్లుగా ఎంపికైన 6956 మందికి బుధవారం ఎల్‌బీ స్టేడియంలో జరిగే కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి నియామకపత్రాలను అందిస్తారు. ఈ కార్యక్రమంలో సబితరెడ్డి, లక్ష్మీ, ఇందిర, ధనలక్ష్మీ, సరళ, సుజాత పాల్గొన్నారు.

డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల లీకేజీ నివారణకు ప్రత్యేక చర్యలు



పనులను పరిశీలిస్తున్న డీజీఎం కృష్ణ, సెక్షన్ మేనేజర్ శ్రీకాంత్

చిలకలగూడ: జలమండలి మారేడుపల్లి డివిజన్ పరిధిలో డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల లీకేజీల నివారణకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామని డీజీఎం కృష్ణ తెలిపారు. సీతాఫల్‌మండి డివిజన్‌లోని ఉప్పరిబస్తీ, బ్రాహ్మణబస్తీ, షాబాద్‌గూడ, వారాసిగూడ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల క్లీనింగ్, తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. కలుషిత జలాల సరఫరా నియంత్రణ, లోప్రెషర్ సమస్యలను పరిష్కరించేందుకు పలు ప్రాంతాల్లో నూతన పైప్‌లైన్లు నిర్మిస్తున్నట్లు వివరించారు. డ్రైనేజీ మ్యాన్‌హోళ్లను పరిశుభ్రం చేసేందుకు ప్రత్యేక వాహనమైన సిల్ట్‌గ్రాబర్ మెషిన్‌ను వినియోగిస్తున్నామని, కార్మికుల అవసరం లేకుండా మ్యాన్‌హోల్ లోపల 15 నుంచి 25 అడుగుల లోతులో పేరుకుపోయిన మట్టి, వ్యర్థాలను తొలగిస్తుందన్నారు. సెక్షన్ మేనేజర్లు నవ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ దళిత విభాగం సీనియర్ వైస్ చైర్మన్‌గా రమేష్‌బాబు

లాలాపేట: అఖిల భారత కాంగ్రెస్ కమిటీ దళిత విభాగం రాష్ట్ర సీనియర్ వైస్ చైర్మన్‌గా అచ్యుత రమేష్‌బాబు నియమితులయ్యారు. ఏఐసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ రాజేష్ లిలోథియా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ డిపార్ట్‌మెంట్ నేషనల్ కోఆర్డినేటర్ కొప్పుల రాజు ఆదేశాలతో నియామక ఉత్తర్వులను మంగళవారం జారీ చేశారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ.. ప్రస్తుతం గ్రేటర్ అధ్యక్షుడిగా ఉన్న తనను రాష్ట్ర సీనియర్ వైస్ చైర్మన్‌గా నియమించడానికి సహకరించిన రాష్ట్ర దళిత విభాగం అధ్యక్షులు నగరిగారి ప్రీతం, సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు.

నైపుణ్యాభివృద్ధికి జాతీయ విద్యావిధానం తోడ్పాటు



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ప్రొఫెసర్లు

ఉస్మానియా యూనివర్సిటీ: విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి జాతీయ విద్యావిధానం ఎంతో తోడ్పాడుతుందని, దీన్ని విజయవంతంగా అమలు చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని వక్తలు పేర్కొన్నారు. తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల షాద్‌నగర్ ఆధ్వర్యంలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ సహకారంతో 'జాతీయ విద్యా విధానం–2020' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీలోని ఐపీఈ హాల్‌లో ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అదనపు కార్యదర్శి మాదవి దేవి, ఐపీఈ మాజీ డైరెక్టర్, సీనియర్ ప్రొఫెసర్ ఆర్.కె. మిశ్రా, ఐసీఏఆర్ మాజీ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎ.డి.దివాన్, రిటైర్డ్ డీన్ ప్రొఫెసర్ ఎం.ఎల్. సాయికుమార్, ప్రొఫెసర్ ప్యాట్రిక్స్ ఆంటోనీ, సీనియర్ ప్రొఫెసర్ శ్రీనివాస మూర్తి, ఐసీఎస్‌ఎస్‌ఆర్ గౌరవ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.సుధాకర్ రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ ఓఎస్‌డి హరిత, మహిళ కళాశాల ప్రిన్సిపల్, కన్వీనర్ డాక్టర్ ఎ.నీతా పోలే తదితరులు పాల్గొని జాతీయ విద్యా విధానం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. జాతీయ విద్యావిధానం అమలు చేస్తే విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధితో పాటు ఉజ్వలమైన భవిష్యత్ ఉంటుందని విద్యావిధానాన్ని సమర్ధవంతంగా అమలు చేసేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: బేగంపేట, మైత్రీవనం, ఎర్రమంజిల్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 వరకు శీష్‌మహల్, ప్లేగ్రౌండ్, దివ్యశక్తి లేన్. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సోనాబాయి టెంపుల్, సత్యం థియేటర్, స్పెన్సర్ బిల్డింగ్, ప్లేగ్రౌండ్ ఏరియా, శీష్‌మహల్ థియేటర్ ఏరియా, హైదరాబాద్ సెంట్రల్, ఠాకూర్ హరిప్రసాద్ లేన్, బజాజ్ ఎలక్ట్రానిక్స్, పంజగుట్ట మెయిన్‌రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందన్నారు.

నేడు ఎల్లమ్మ ఆలయంలో దర్శనాల నిలిపివేత

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ దేవాలయంలో నేడు (బుధవారం) శతచండీయాగసహిత మహాకుంభాభిషేక మహోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 అన్ని దర్శనాలను నిలిపివేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి కుంట నాగరాజు తెలిపారు.జగద్గురువు ఆది శంకరాచార్య కంచికామ కోటి మూలామ్నాయ సర్వజ్ఞ పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతీ చేతుల కలశాభిషేకం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

కుష్ఠు సాధారణ చర్మవ్యాధి మాత్రమే

గాంధీ ఆస్పత్రి : ప్రపంచ లెప్రసీ నివారణ వారోత్సవాలను పురస్కరించుకుని గాంధీ ఆస్పత్రి డెర్మటాలజీ, వెనిరాలజీ, లెప్రసీ (డీవీఎల్), ఐఏడీవీఎల్ ఆధ్వర్యంలో మంగళవారం ఆస్పత్రి ప్రాంగణంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వైద్య నిపుణులు మాట్లాడుతూ.. కుష్ఠువ్యాధి సాధారణ చర్మ వ్యాధి మాత్రమేనని, ప్రాథమిక దశలో గుర్తించి సరైన వైద్యం అందిస్తే నియంత్రణ సాధ్యమన్నారు. స్పర్శలేని తెల్లమచ్చలు ఉంటే వెంటనే వైద్యుని సంప్రదించాలన్నారు. కరచాలనం, కలిసి భోజనం చేయడం, ఉమ్మడి మరుగుదొడ్లు వాడడంతో కుష్ఠువ్యాధి రాదన్నారు. ఇండియన్ అసోషియేషన్ ఆఫ్ డెర్మటాలజీ, వెనిరాలజీ, లెప్రసీ (ఐఏడీవీఎల్) ఆధ్వర్యంలో 'బీట్ లెప్రసీ..ప్రివెంట్ స్టిగ్మా..ప్రమోట్ డిగ్నిటీ' నినాదంలో ఈ ఏడాది ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అవుట్ పేషెంట్ విభాగంలో వైద్య శిబిరం నిర్వహించి రోగులకు ఉచితంగా మందులు అందించారు. ఆస్పత్రి ప్రాంగణంలో చైతన్య ర్యాలీ నిర్వహించారు. గాంధీ డీవీఎల్ హెచ్‌ఓడీ నర్సింహరావు నేత, వైద్యులు భూమేష్ కుమార్, రఘుకిరణ్, ప్రవీణ్‌కుమార్, శంకర్, నాగశ్వేత, సుధారాణి, డీవీఎస్ ప్రతాప్, సత్తెయ్య, పీజీలు, వైద్య విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న గాంధీ డీవీఎల్ వైద్యులు

బేగంపేట ఎస్‌హెచ్‌ఓగా చిర్రా రామయ్య

సనత్‌నగర్: బేగంపేట ఎస్‌హెచ్‌ఓ చిర్రా రామయ్యకు బాధ్యతలను అప్పగిస్తూ నగర పోలీసు కమిషనర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ఇక్కడ ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వర్తించిన జుట్టు భాస్కర్‌ను మారేడ్‌పల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా బదిలీ అయ్యారు. అక్కడ పనిచేసిన రామయ్యను బదిలీపై బేగంపేట లా అండ్ ఆర్డర్‌కు రానున్నారు.

గర్భాశయ కేన్సర్‌పై అప్రమత్తత అవసరం

చిలకలగూడ : గర్భాశయ కేన్సర్‌పై మహిళలు మరింత అప్రమత్తంగా ఉండాలని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ సూచించారు. సీతాఫల్‌మండి కమ్యూనిటీహాల్లో ఐఆర్‌డీఏ, సీపాత్‌ల్యాబ్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సర్వేకల్ కేన్సర్ నిర్ధారణ పరీక్షల శిబిరానికి ఆమె హాజరై మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో ఎక్కువ మంది మహిళలు గర్భాశయ కేన్సర్ బారిన పడుతున్నారని, ముందు జాగ్రత్తగా నిర్ధారణ పరీక్షలు చేయించుకుని తగిన వైద్యచికిత్సలు పొందాలన్నారు. అనంతరం గైనకాలజిస్ట్ ఉమాదేవి నేతృత్వంలో సుమారు వందమంది మహిళలకు సర్వేకల్ కేన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సీపాత్ ల్యాబ్ సీఈఓ రంజనీ చక్రవర్తి, ఐఆర్‌డీఏ అధ్యక్షులు వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఏపీలో కులగణనను వ్యతిరేకించడం అవివేకం



లింగంగౌడ్

ఉస్మానియా యూనివర్సిటీ: ఆంధ్రప్రదేశ్‌లో కులగణనను నిలిపివేయాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ ఈసీకి లేఖ రాయడం అవివేకమని బీసీ సంక్షేమ రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు. మతిభ్రమించి మాట్లాడుతున్న ఆయన్ను విశాఖలోని మానసిక వైద్యశాలలో చేర్పించాలన్నారు. సీఎం వైఎస్ జగన్ పేదల అభ్యున్నతి కోసం కృషి చేస్తుంటే కావాలని కొందరు కుట్రలు పన్నుతున్నారని కులగణనతోనే బీసీల హక్కులు సాధించుకోగలమన్నారు.

పార్టీ పటిష్టతకు కృషి

లాలాపేట: తార్నాక డివిజన్ మాణికేశ్వర్‌నగర్‌కు చెందిన ఆలకుంట లింగయ్య సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. మంగళవారం డీసీసీ అధ్యక్షులు ఎం. అనిల్‌కుమార్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా లింగయ్య మాట్లాడుతూ..పార్టీ పటిష్టతకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కార్యదర్శిగా తులసీరాం..

సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా ఓయూ మాణికేశ్వర్‌నగర్‌కు చెందిన బి. తులసీరాంను నియమిస్తూ డీసీసీ అధ్యక్షులు ఎం. అనిల్‌కుమార్ యాదవ్ మంగళవారం నియామక పత్రాన్ని అందజేశారు.

ఫిబ్రవరి 20 నుంచి పీజీ కోర్సుల పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో వివిధ పీజీ రెగ్యులర్ కోర్సుల 3వ సెమిస్టర్ పరీక్షలు ఫిబ్రవరి 20 నుంచి ప్రారంభం కానున్నాయి. ఇంత వరకు పరీక్ష ఫీజు చెల్లించని విద్యార్థులు ఫిబ్రవరి 3, రూ.300 అపరాధ రుసుంతో 8 వరకు చెల్లించవచ్చని అధికారులు తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషిచేస్తా

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా రాంగోపాల్‌పేట్ డివిజన్‌కు చెందిన ఠాకూర్ హేమంత్ సింగ్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షులు ఎం అనిల్‌కుమార్ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఠాకూర్ హేమంత్ సింగ్ మాట్లాడుతూ.. రాంగోపాల్‌పేట్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు చేరేలా తన వంతు కృషి చేస్తానన్నారు.

ఏడాదిలోనే ఎంఎస్ పూర్తి చేసే అవకాశం

అమీర్‌పేట: అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ లూయివెల్‌లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు యూనివర్సిటీ ప్రతినిధి డాక్టర్ పాల్ హాఫ్‌మన్ తెలిపారు.అమీర్‌పేట హోటల్ ఆదిత్యపార్క్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఎంఎస్ చదువుకునేందుకు వచ్చే విద్యార్థులు కేవలం 13,800 డాలర్లు ట్యూషన్ ఫీజు చెల్లించి మొత్తం క్రెడిట్‌లు పూర్తి చేయగలిగితే ఒక ఏడాదిలోనే ఎంఎస్ పూర్తి చేసుకునే అవకాశం ఉందన్నారు. ఫిబ్రవరి 1న ఆదిత్య పార్క్ హోటల్‌లో స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ ఉంటుందని యూనివర్సిటీ హబ్ భాగస్వామ్యంతో కంప్యూటర్ ఇంజినీరింగ్, సివిల్, బయో, ఇండస్ట్రియల్, మెకానికల్, కెమికల్, మెటీరియల్ సైన్స్ ఇంజినీరింగ్‌తో పాటు బిజినెస్ ఇంజినీరింగ్, నర్సింగ్, పబ్లిక్ హెల్త్ వంటి కోర్సులను అందిస్తున్నట్లు తెలిపారు. డైనమిక్ బిజినెస్, టెక్నాలజీ ల్యాండ్ స్కేప్ కోర్సులు ప్రవేశపెడుతున్నామని వివరించారు. డాక్టర్ అనిల్ పల్లా పాల్గొన్నారు.




కోర్సుల వివరాలను వెల్లడిస్తున్న పాల్ హాఫ్‌మన్

మహాత్ముడికి ఘన నివాళి



బాపూజీ విగ్రహానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న ప్రిన్సిపల్ రమేష్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ కృష్ణమోహన్



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సేవాదళ్ ప్రతినిధులు

సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో మంగళవారం మహాత్మాగాంధీ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రులలో గాంధీ చిత్రపటాలు ఏర్పాటు చేసిన అధికారులు, నాయకులు నివాళులర్పించారు. –సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ జోన్ల బృందం



గాంధీ విగ్రహానికి నివాళులర్పించిన కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి



గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న కార్పొరేటర్ సామల హేమ



మహాత్ముడి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సూపరింటెండెంట్ రాజారావు